ఉపముఖ్యమంత్రికి శుభాకాంక్షలు




ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంజీవరావు, దండుగుల యాదగిరి

ప్రజా భవనంలో ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను శుక్రవారం బి.సంజీవరావు, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్‌బోయిన్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు కావేటి మల్లికార్జునయాదవ్, నాయకులు షాయిన్‌షా, రాములు, దత్తా, రోహిత్, స్టీఫెన్, శశాంక్, భరత్, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

– ఆల్విన్‌కాలనీ/ఓల్డ్‌బోయిన్‌పల్లి

లూలూ మాల్‌లో మిల్లెట్ ఉత్సవ్



మిల్లెట్స్‌ను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని లూలూ మాల్‌లో మిల్లెట్ ఉత్సవ్‌ను శుక్రవారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా లులు మాల్‌లో సుమారు 100 రకాలైన మిల్లెట్స్‌ను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా లులు మాల్ నిర్వాహకులు మాట్లాడుతూ.. మిల్లెట్స్‌కు డిమాండ్ రోజురోజుకు పెరుగుతోందన్నారు. ఆరోగ్య ప్రయోజనాల కారణంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు మిల్లెట్స్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. దీంతో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రోత్సహించే విధంగా లులు మాల్‌లో 100 రకాలు, 76 రకాల ప్రీమియం బ్రాండ్‌లో అద్భుతమైన ఆఫర్లతో అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం వేడుకల్లో చేరిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక రకాల మిల్లెట్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంప్రదాయ, రుచికరమైన తీపి మిల్లెట్ వంటకాలతో లైవ్ వంట కౌంటర్లు, ప్రత్యేకమైన ఆఫర్లు, బ్రాండ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి



సర్దార్ పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు

కూకట్‌పల్లి: భారతదేశ ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్ సర్దార్ పటేల్ నగర్ ఆర్చ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ స్వాతంత్య్ర యోధుడిగానే కాకుండా స్వాతంత్య్రం అనంతరం సంస్థానాలను భారత్‌లో విలీనం చేయడానికి కృషి చేశారన్నారు. హైదరాబాద్, జునాఘడ్ వంటి బలంగా ఉన్న సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కు దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ఇన్‌చార్జ్ ఎస్.ప్రీతంరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్–శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సు సౌకర్యం

● కొత్త రూట్లో రూట్ నంబర్ 333 బస్సు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో నుంచి నంబర్ 333 బస్సును కొండాపూర్ నుంచి శంషాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు కొత్త బస్సుసౌకర్యాన్ని హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ ప్రారంభించారు. శనివారం నుంచి ప్రతి రోజు ఈ బస్సు ఉదయం 6.30 గంటలకు కొండాపూర్ నుంచి మొదటి బస్సు బయలు దేరుతుంది. చివరి బస్సు సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరుతుంది. ఉదయం 6.30 గంటల నుంచి ప్రతి గంటకు ఒక బస్సును కొండాపూర్ నుంచి అందుబాటులో ఉండేలా చేస్తున్నారు. కొండాపూర్ నుంచి బయలుదేరి హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీ చెక్‌పోస్ట్, జర్నలిస్ట్ కాలనీ, ఏసీబీ ఆఫీస్, మాసబ్‌ట్యాంక్, సరోజిని ఆస్పత్రి, మెహదీపట్నం, అత్తాపూర్, హైదర్‌గూడ ఎక్స్‌రోడ్, ఉప్పరపల్లి ఎక్స్‌రోడ్, వీకర్ సెక్షన్ కాలనీ, ఆరాంఘర్, ఏజీకాలేజ్, శంషాబాద్, రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు బస్సును నడిపిస్తారు. శంషాబాద్, ఎయిర్‌పోర్టు వైపు వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి కోరారు.

అత్యధిక పేటెంట్లలో జపాన్‌ది అగ్రస్థానం

● 'మనూ' లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్

రాయదుర్గం: సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశ పురోగతిని పేటెంట్ల పరంగా కొలుస్తారని మనూ లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో శుక్రవారం 'మేధో సంపత్తి– హక్కులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక పేటెంట్లతో జపాన్ అగ్రస్థానంలో ఉందని, చైనా ముందుకు దూసుకుపోతోందన్నారు. భారతదేశం తన పరిశోధనలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. యూనివర్సిటీలు నాణ్యమైన పరిశోధనలను ప్రోత్సహించాలన్నారు. వీసీ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన అవసరమన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ప్రొఫెసర్ కనీజ్ జెహ్రా, డాక్టర్ సుధాంశుచంద్ర ప్రసంగించారు.

హ్యాట్రిక్ అందించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా

• కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు • నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం • నా విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు • నియోజకవర్గ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు, మహిళలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం అందించిన ప్రతి ఒక్కరికి ఋణపడి ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గడిచిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం పని చేసిన వారికి, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

◆ ఓల్డ్‌బోయిన్‌పల్లి నా సెంటిమెంట్ డివిజన్..

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ తనకు సెంటిమెంట్ డివిజన్‌గా కలిసి వచ్చిందని తెలిపారు. గత మూడు ఎన్నికల ప్రచారం ఇక్కడి నుంచే మొదలు పెట్టానన్నారు. దీంతో ప్రతి ఎన్నికలో విజయం సాధించానని పేర్కొన్నారు. తన విజయానికి తమ సొంత ప్రణాళికలతో ప్రచారం చేసిన చాలా మంది నాయకులు బయటకు రాకపోయిన వారిని గుర్తుంచుకుంటానని తెలిపారు.

◆ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేశారు...

నాయకులతో పాటు కార్యకర్తలు మాధవరం కృష్ణారావు గెలుపే లక్ష్యంగా కష్టించి పని చేశారని అన్నారు. ఇతర పార్టీల వారు మన నాయకులకు ఎన్నో ఆఫర్లు ఇచ్చినా వాటిని పక్కన పెట్టి 'మా అన్న గెలవడమే ముఖ్యమని'చెప్పిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఇది జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుందని చెప్పారు.

◆ నా విజయానికి కృషి చేసిన మహిళలకు కృతజ్ఞతలు..

మహిళలు తన విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని గుర్తు చేశారు. వారికి జీవితాంతం ఋణపడి ఉంటానని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత మూడు ఎన్నికల్లో తనకు అత్యాధిక మెజార్టీ ఇస్తూ తనపై నమ్మకం పెట్టి ఓటేసిన ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తనపై అభిమానం చూపారని... ప్రజల అభిమానానికి కృతజ్ఞుడిగా పని చేస్తానని హామీ ఇస్తున్నానన్నారు.

◆ ఓల్డ్‌బోయిన్‌పల్లికి ఆఖరి ఎమ్మెల్యే నేనే కావచ్చు..

వచ్చే ఎన్నికల్లో డీలిమిటేషన్‌లో భాగంగా బాలానగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్లతో పాటు మరికొన్ని ప్రాంతాలు కలిసి వేరే నియోజకవర్గంగా అవతరించనుందని ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. బహుశా తన నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌కు ఆఖరి ఎమ్మెల్యే తానే కావచ్చని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఎజాజ్, కర్రె జంగయ్య, కర్రె లావణ్య, మేకల హరినాథ్, మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, కనకరాజుయాదవ్, పోచయ్య, సరోజదేవి, శాలిని, లలితా తదితరులు పాల్గొన్నారు.

రోటి మేకర్ విరాళం

బాలానగర్: జేఎన్‌టీయూ హాస్టల్ విద్యార్థుల సౌకర్యం కోసం ఇండస్ట్రియల్ అధినేత విజయన్ రావు రోటి మేకర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రోటీ మేకర్ వల్ల పనిభారం తగ్గటమే కాకుండా ఎక్కువ రోటీలు తయారు చేసి విద్యార్థులకు అందించే అవకాశం ఉంటుందన్నారు. 3 లక్షల 75 వేలతో రోటి మేకర్‌ను విరాళంగా అందించిన దాతను విద్యార్థుల తరపు కృతజ్ఞతలు తెలిపారు.

గ్యార్వీ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న మోయిజ్ తదితరులు

మూసాపేట: మూసాపేటలో సీనియర్ నాయకులు షరీఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం గార్వీ ఉత్సవాలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోయిజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడ జంక్షన్ మూసివేత

గచ్చిబౌలి: ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో భాగంగా ఖాజాగూడ జంక్షన్‌ను మూసివేస్తున్నట్లు రాయదుర్గం ట్రాఫిక్ సీఐ శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. షేక్‌పేట్ ఫ్లైఓవర్, నానక్‌రాంగూడ రోటరీ, బయోడైవర్సిటీ జంక్షన్‌ల నుంచి వచ్చే వాహనాల రద్దీతో ఖాజాగూడ జంక్షన్ జాం అవుతోంది. ఈ క్రమంలో శనివారం నుంచి ఖాజాగూడ జంక్షన్ మూసివేయనున్నారు. నానక్‌రాంగూడ రోటరీ నుంచి విస్పర్‌వ్యాలీ వైపు వెళ్లే వాహనదారులు పక్వాన్ హోటల్ ముందు యూటర్న్ తీసుకోవాలి. షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి వాహనదారులు ఫిలింనగర్ వైపు వెళ్లాలంటే పక్వాన్ హోటల్ వద్ద యూటర్న్ తీసుకోవాలని, బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి మణికొండ వెళ్లాలనుకునే వారు షేక్‌పేట్ ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి రక్షణ కిట్ల పంపిణీ



వార్డు కార్యాలయంలో రక్షణ కిట్లను అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు

మోతీనగర్: విధి నిర్వహణలో పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని మోతీనగర్–అల్లాపూర్ ఎస్‌ఆర్‌పీ వడ్ల సురేష్‌కుమార్ చారి పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో 177 మంది పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో గ్లౌజులు, మాస్క్, షూ తప్పనిసరిగా ధరించాలన్నారు. అదే విధంగా నూనె, సబ్బులు విధిగా ఉపయోగించుకోవాలని సూచించారు. అదే విధంగా రోడ్లపై విధులు నిర్వహించనప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కిట్‌లో ఉన్నటువంటి ప్రతి వస్తువును ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ సురేందర్, సురేష్, అరుణ్, రవి, నర్సింగ్, శివం, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు



ప్రగతినగర్ కమ్యూనిటీహాల్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: ప్రగతినగర్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం ఆయుర్వేదిక్ వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద మందులు వాడితే ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవన్నారు. కేంద్ర ప్రభుత్వం జనరిక్ మెడిసిన్, ఆయుర్వేదిక్‌కు సంబంధించిన మెడిసిన్ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అడిగిన వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీహాల్ అధ్యక్షుడు వినోద్, బీజేపీ నాయకులు మల్లేష్‌గౌడ్, దాకయ్య, మాణిక్, రాజేందర్, యాదయ్య, కిషోర్, శివరాజ్ యాదవ్, వైద్యులు ఉమా, నాగరాజు, శ్రావణి, మధుకర్, లావణ్య, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని గోదాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ... దేవుడి కృప వలన ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఎంతో పవిత్రంగా భావించే క్రిస్మస్ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



చెరువు కబ్జాను సీఎం దృష్టికి తీసుకెళ్తా..

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్




అల్లాపూర్ డివిజన్‌లో కబ్జాకు గురైన చెరువులను సందర్శించి స్థానికులతో మాట్లాడుతున్న బండి రమేష్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని మైసమ్మ చెరువు, కాముని చెరువు పూర్తిగా కబ్జాకు గురి అవుతోందని స్థానికుల కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం చెరువులను సందర్శించి ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ కబ్జాలతో సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లలోని తమ కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు తెలిపారు.

◆ ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... చెరువులను పరిరక్షించాలని గత ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కూకట్‌పల్లి నియోజకవర్గంలో చెరువులు కబ్జాకు గురికావడం ఆందోళనకరంగా ఉందన్నారు. మైసమ్మ చెరువు 90ఎకరాల విస్తీర్ణం ఉంటే నేడు 9ఎకరాలకు కుంచించుకపోయిందన్నారు. కాముని చెరువు పూర్తిగా కబ్జాకు గురైందని.. రాత్రికి రాత్రే బండరాళ్లు వేసి చదును చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారన్నారు. ఇంత జరుగుతుంటే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత పెద్ద ఎత్తున కబ్జా జరుగుతున్నా కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుకు కనిపించటం లేదా అని అన్నారు.

◆ ఎమ్మెల్యే అనుచరులు, కార్పొరేటర్ భర్త విచ్చలవిడిగా కబ్జాలకు పాల్పడుతున్నారని స్థానికులు బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కబ్జా జరిగిన తీరును వివరిస్తామన్నారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారికి సహకరించిన అధికారులను సైతం వదిలిపెట్టమని హెచ్చరించారు. చరువులను సందర్శించిన వారిలో స్థానిక నేతలు రేష్మ, విఠల్‌రెడ్డి, నరసింహ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, గంటా శ్రీనివాస్, బర్కత్‌హుళ్లి, మోహిస్, ఖాజాపాషా, జబీర్, దినేష్ నాయక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మండల పూజ



అయ్యప్పను దర్శించుకుంటున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి మండల పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామయోగి గుప్తా, రమణ గురుస్వామి, మూర్తి గురుస్వామి, నగేష్‌గుప్తా, శేఖర్‌గౌడ్, సోమేష్, ఉపేందర్, కిరణ్ స్వాములు పాల్గొన్నారు.

రియల్ మీ సీ67డీ విడుదల

మాదాపూర్: రియల్ మీ కొత్తమోడల్ సీ67డీ ని ప్రముఖ సినీనటి శివానీ రాజశేఖర్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ రేతినేనితో కలసి శుక్రవారం మాదాపూర్ సెలెక్ట్ మొబైల్స్ స్టోర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నాలజీస్‌ను, సరికొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టడంలో సెలెక్ట్ మొబైల్స్ ముందుంటుందన్నారు. ఈ మోడల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో ఉన్న అన్ని సెలెక్ట్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏఐటీ డైరెక్టర్ తరిణి ప్రసాద్, ఎల్ఎఫ్ఆర్ హెడ్ పునీత్ చతుర్వేది తదితరులు పాల్గొన్నారు.

రామారావునగర్ సమస్యలను పరిష్కరిస్తాం



నాలా అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: రామారావునగర్‌లో అదనంగా మంజూరు చేసిన కోటి 90 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన నాలా అభివృద్ధి పనులను శుక్రవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మాధవరం కృష్ణారావు సహకారంతో అదనంగా మంజూరు చేసిన నిధులతో నాలా విస్తరణ పనులు చేపట్టామన్నారు. పనులు పూర్తయితే లోతట్టు ప్రాంతమైన రామారావునగర్‌లో ముంపు సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, ఆవుల సంజీవ, వెంకటరమణ, ముక్తార్, యోగిరాజు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్–2023

మాదాపూర్: విద్య, జీవనశైలి, పోషకాహారం, అభిరుచులు నాలుగు కీలక విభాగాలలో ఉత్పత్తులు, సేవలతో ప్రదర్శన ఉంటుందని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టీజీ తెలిపారు. శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్ సెంటర్‌లో హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ 2023కి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు హైటెక్స్‌లో ఫెయిర్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రదర్శనలో పిల్లల పరుగు, భారీసైజు జెంగా, పిల్లల ఫ్యాషన్ షో, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లు, ఫ్లూయిడ్ ఆర్ట్ కార్యక్రమాలను ఉంటాయన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్ వైస్ ప్రెసిటెండ్ స్మితా చౌదరి, హోలి జాలీ డైరెక్టర్ అఖిల భూపతిరాజు, లైఫ్‌స్పామ్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, హైదరాబాద్ రన్నర్స్ జనరల్ సెక్రటీ అరుణ్‌కుమార్, నటి ప్రజ్ఞ్యానయన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి

నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి



రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయం గచ్చిబౌలి వార్షిక క్రీడోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలను నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల పట్ల కూడా ఆసక్తి కనబర్చాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు.

60వ వ్యవస్థాపక దినోత్సవం

కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలిలో 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పలు కార్యక్రమాలను నిర్వహించారు.

మిల్లెట్ క్రిస్మస్ ట్రీ

గచ్చిబౌలి: మిల్లెట్స్‌తో క్రిస్మస్ ట్రీని రూపొందించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరాన్ని పురస్కరించుకొని మిల్లెట్స్‌తో తయారు చేసిన క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. ఏడు రకాలైన ఫాక్స్‌టైల్ మిల్లెట్, బార్న్‌యార్డ్ మిల్లెట్ , పెర్ల్ మిల్లెట్, జొన్న మిల్లెట్, లిటిల్ మిల్లెట్, కోడో మిల్లెట్, ఫింగర్ మిల్లెట్లను క్రిస్మస్ ట్రీ తయారీలో ఉపయోగించారు. పది అడుగుల ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పు, పది కిలోల బరువుతో తయారుచేశారు. చిరు ధాన్యాలపై అవగాహన, ప్రోత్సహించేందుకు క్రిస్మస్ ట్రీ ని రూపొందించినట్లు మంజీరా హోటల్స్ అండ్ రిసార్ట్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.వి.గణేష్ తెలిపారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

● టాస్కులు, కమిషన్ల పేరుతో మోసం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.29 లక్షల 56 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... అమీన్‌పూర్ మండల పరిధిలోని పిజెఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ డిసెంబర్ 12న తన వాట్సాప్‌కు తేదీన మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు.దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు.కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు.ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.29 లక్షల 56 వేలు చెల్లించాడు.సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్ పరిధిలో..

అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 10వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.11 లక్షల 73 వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.